# అనుభవం

గణపతిని చూస్తే అతను వ్యాయామం చేస్తాడనే సంగతి చెప్పకుండానే తెలిసిపోతుంది. వ్యాయామం గురించి కొంచెం బాగా తెలిసిన వాళ్ళకైతే, అతని భుజాల దృఢత్వాన్నీ, విశాల వక్షాన్నీ, చెక్కినట్టు తయారైన మెడనీ, ఉక్కు గుళ్ళలాంటి పిడికిళ్ళనీ చూస్తే — అతను ఏయే రకాల వ్యాయామాలు చేస్తాడో కూడా తెలిసిపోతుంది.

రెండేళ్ళ కిందట గణపతి బియ్యేలో కొచ్చిన కొత్తలో, ఎవరో ఒకసారి వ్యాయామం గురించి మాట్లాడుకుంటూ వుంటే అటుపోతూ కాస్సేపు ఆగి విన్నాడు. మర్నాడు చీకట్నే లేచి వ్యాయామశాలకి దారి తీశాడు. మొదట అతను ఆటలాగ ప్రారంభించాడు గానీ, రాను రానూ తన శరీరం ఎంతో దృఢంగా, ఎంతో సౌష్టవంగా తయారవుతోంటే, నాలుగైదు నెలల్లోనే పూర్తిగా వ్యాయామానికి అంకితమైపోయాడు.

అతను ఎన్నడూ వ్యాయామం మానడు. ఎప్పుడైనా ఏదైనా పని తగిలి మానవలసివస్తే, తన సిరి సంపద లేవో తరిగిపోతున్నట్టు విలవిల్లాడిపోతాడు. రోజూ తను అనుకున్న ఎక్సర్‌సైజులన్నీ చేసి, కొసరుగా ఇంకో పది నిమిషాలు కూడా చేస్తేనేగానీ అతనికి తృప్తి వుండదు.

వెయ్యేసి పౌండ్ల ఇనప గుళ్ళని సునాయాసంగా ఎత్తి గాలిలో తిప్పే తన శరీర శక్తిని చూసుకున్నప్పుడల్లా గణపతి అనుకుంటాడు — ప్రపంచంలో అన్యాయాలన్నీ తనొక్కడే అరికట్టలేడా అని. అది ఎంత అసాధ్యమో అతనికీ తెలుసుగానీ, సాధ్యమే నేమో అన్నదే అతని ఆశ నిన్నమొన్నటి దాకా!

అతని స్వభావం కొంచెం తెలిసిన వాళ్ళకి అతను ఆరోగ్యంగా వున్న పసిపిల్లాడిలా కనిపిస్తాడు. నిజంగా అవసరమైనప్పుడు తన దేహబలాన్ని తగినంత కరినంగా ఉపయోగించగలడా — అనే సందేహం కలిగిస్తాడు.

గణపతికి వ్యాయామమే తిండి. వ్యాయామమే నిద్ర. వ్యాయామమే సమస్తం. ఆడా మగా, పిల్లా జెల్లా అంతా, వ్యాయామం చెయ్యాలంటాడు.

మెస్‌లో భోజనాలప్పుడో, హాస్టల్‌లోనో, లైబ్రరీలోనో, క్లాసులోనో, సాయంత్రాలు యూనివర్శిటీ కాంపస్‌లో తిరిగేటప్పుడో, రోజుకి ఇద్దరికో ముగ్గురికో వ్యాయామ పాఠాలు బోధించకుండా వుండడు గణపతి.

ఏ విద్యార్థయినా కాస్త బక్కపలచగా కనపడితే చాలు. బక్కపలచగా వున్న వాళ్ళంతా బలహీనులే — అతని దృష్టిలో. బలహీన విద్యార్థిని చూశాడో వెంటనే అతని దగ్గరికి బైల్దేరతాడు. ముందు తనని తను పరిచయం చేసుకుని "క్షమించండి..." అంటూ ప్రారంభిస్తాడు. రెండేళ్ళ కిందట తను ఎంత సన్నగా వుండేవాడో ఊహించి చెప్పమంటాడు. అటూ ఇటూ చూసి, అక్కడో గడ్డి పరకో పుల్లముక్కో సంపాయించి దాన్ని చూపించి — "మీరు నమ్మండి, నమ్మకపోండి, ఇంత సన్నగా వుండేవాణ్ణి" అంటాడు.

"అలాంటి వాణ్ణి ఇలా ఎలా అయ్యానో మళ్ళీ ఊహించండి" అంటాడు.

వాళ్ళ మొహాల మీద తన దండలూ, పిడికిళ్ళూ ప్రదర్శిస్తూ — మితిమీరిన ఆనందంతో, తను రోజూ చేసే వందలకొద్దీ మీటర్ల పరుగులూ, వెయిట్ లిఫ్టింగ్‌లూ, బెంచిప్రెస్‌లూ, బస్కీలూ, ఉల్ బైర్‌లూ, షాడో బాక్సింగ్‌లూ — అన్నిటి గురించీ యాకరవు పెడతాడు. ఏది ఏ అవయవాన్ని తీర్చిదిద్దుతుందో, ఏది ఎంత అద్భుతంగా పనిచేస్తుందో, వర్ణిస్తాడు. వ్యాయామం ప్రారంభించక ముందు తన జీర్ణకోశం ఎంత బలహీనంగా వుండేదో— ఇప్పుడెలాగుందో, అప్పుడు రోజంతా ఎంత డల్‌గా నిరుత్సాహంగా వుండేదో — ఇప్పుడెలాగుందో — ఉత్సాహంతో పొంగిపోతూ ఉపన్యసిస్తాడు.

శ్రోతలు అతని ఉపన్యాసానికి ముగ్ధులైపోయి "రేపట్నించీ మేమూ వస్తామండీ" అనేస్తారు తమకు తెలీకుండానే.

ఇక పట్టుకుంటాడు గణపతి, వాళ్ళని. వాళ్ళు ఏ

హాస్టలో, ఏ రూమో తెలుసు కుంటాడు. "తెల్లారగట్ల వచ్చి లేపుతాను, వెళ్ళ"మంటాడు.

వాళ్ళు, కొంచెం మొహమాటపడి — "మేం అలారం పెట్టుకుని లేస్తాంలెండి. మేం వస్తాంలెండి" అంటే గణపతి ఒప్పుకోడు. "అలారం మోగుతుందని గ్యారంటీ ఏవిటి? నేనైతే వస్తానని గ్యారంటీ ఇస్తాను. మీ కెందుకు, మీరు వెళ్ళండి. చీకట్నే నేనొస్తాగా?" అని అక్కణ్ణించి బైల్దేరతాడు. కొన్ని మానవ శరీర, హృద యాలు వ్యాయామ సౌఖ్యానందాల్ని మర్నాటినించీ అనుభవించ బోతున్నాయి కదా — అని ఆనందంతో పొంగిపోతూ తన రూము చేరతాడు.

తెల్లారు ఝామున రోజుకన్నా ముందు లేచి, ఆ ఫలానా విద్యార్థి గదిముందు ప్రత్యక్షమై తలుపులు బాది కేకలేసి, ఎలాగైతేనేం అతణ్ణి లేవగొట్టి కూర్చో బెడతాడు.

ఆ విద్యార్థి, ముందు కంగారుపడి, తర్వాత ఆవలించి "పొండి సార్! మధ్యాన్నం వస్తా" అనో, "నిద్రొస్తోందండీ" అనో ఒక్క ముక్క చెప్పేసి గణపతి కళ్ళముందే పడి నిద్రపోతాడు.

గణపతి మరీ ఘోరంగా నిరుత్సాహ పడిపోడు. "సరేలెండి. మీ సంగతి రేపు చూస్తా" అని వార్నింగ్ ఇచ్చేసి వ్యాయామశాల వేపు పరుగు తీస్తాడు.

నెల్లాళ్ళ వరకూ అయినా సరే ఆ స్టూడెంట్ చుట్టూ తిరిగి, తెల్లారగట్ల లేవగొట్టి అతన్ని వ్యాయామశాలకు లాక్కొస్తేగానీ పట్టు వదలడు గణపతి.

వ్యాయామం చేస్తామని మొదట నోరు జారి, తర్వాత రకరకాల ఎత్తులేసి, లాభం లేక, నిద్రలో సణుగుతూ గణపతి వెనకాలబడి వచ్చిన వాళ్ళు ఇవ్వాళ్ళ వాళ్ళకై వాళ్ళే లేచి వచ్చి గంటకు పైగా ఎక్సర్ సైజులు చేసే ఉత్సాహంతో వున్నారంటే, అదంతా గణపతి చలవే!

రామారావు గణపతికి ఒక సంవత్సరం సీనియరు. ఎమ్మే ఆఖరి సంవత్సరంలో కొచ్చాడు. విద్యార్థి ఉద్యమాలంటూ తిరుగుతూ వుంటాడు. విద్యార్థి పేపరు కూడా ఒకటి నడుపుతున్నాడు.

ఉద్యమాల్లో తిరిగే వాళ్ళకి మరింత శరీర దారుఢ్యం వుండాలని వాదిస్తాడు గణపతి.

రామారావు కాంపస్ చుట్టూ నాలుగు రౌండ్లు పరిగెత్తడంతో తన వ్యాయామం సరిపెడుతూ వుంటాడు. అది కూడా అప్పుడప్పుడూ ఎగ్గొడుతూ వుంటాడు.

గణపతి రామారావుని లేపాలని అతని గదికి ఎప్పుడు పోయినా, అతను అలిసిపోయి నిద్రపోతూనో, సీరియస్‌గా రాసుకుంటూనో కనపడతాడు. రామారావు ఎంత పనిలో వున్నా, గణపతి తెల్లవారు ఝామున రూమ్ ముందు ప్రత్యక్షం అయితే విసుక్కోకుండా ముందు వ్యాయామ దేవతకు తన భక్తి ప్రణామా లర్పించి, తర్వాత తన ఇబ్బందులేమిటో చెప్పు కుంటాడు.

అతను ఏ రోజూ అర్ధరాత్రి దాటితే గాని పడు కోడు. పేపర్‌కి వ్యాసాలు రాయడమో, ఇతర్లు రాసిన వాటిని దిద్దడమో, ప్రెస్ ప్రూఫులు దిద్దడమో, రాత్రుళ్ళు గోడలమీద రాతలకు పోవడమో, విద్యార్థి సమస్యల మీద జరిగే చర్చల్లో కూర్చోడమో, ఏ పనీ లేకపోతే క్లాసు పాఠాలు చదవడమో — మొత్తమ్మీద అతను ప్రతీరాత్రీ ఒంటిగంట దాటితేనే గాని నిద్రపోడు.

అలాంటి వాణ్ణి తెల్లారగట్ల లేవమనడం ఘోరమే ననిపిస్తుంది గణపతికి కూడా.

రామారావు చెప్పే పనులన్నిటి గురించీ గణపతి తరిచి తరిచి అడిగి తెలుసుకుని చాలా సానుభూతి చూపిస్తాడు. "చూశారా, ఎంత మంచి పనులు చేస్తు న్నారో మీరు! మీలాంటి వాళ్ళు వ్యాయామం కూడా చేస్తే ఎంత బాగుంటుందో ఆలోచించండి! 'ఈసురో మని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్?' అనలేదా మన గురజాడ? కొన్నాళ్ళు మీ ఉద్యమాలూ అవీ పక్కకి పెట్టి ముందు వ్యాయామం చేసి బలంగా అవ్వండి! తర్వాత మీ ఉద్యమాలు మీరు చూసు కోండి!" అని చెప్పి చక్కటి మార్గం చూపించా నను కుంటాడు గణపతి.

రామారావు నవ్వి — "రెండిట్లో దేన్నో ఒకదాన్ని పక్కకి పెట్టవల్సిన పరిస్తితి వస్తే, వ్యాయామాన్నే పక్కకి పెట్టాలిగానీ ఉద్యమాన్ని కాదు. నా పనుల్లో సగం పనులు మీకప్పగిస్తాను, మీరు చెయ్యండి! అప్పుడు నాకు టైమ్ వుంటుంది. మీతోపాటు నేనూ ఎక్సర్‌సైజ్ చేస్తాను. ఇవ్వాళ కొన్ని పోస్టర్లు అంటించాలి, వస్తారా?" అంటాడు రామారావు.

గణపతి ఇబ్బందిపడి "అవన్నీ నాకు చేతకావు లెండి. మీరు పేపర్‌కి చందా ఇమ్మంటే ఇచ్చానా లేదా?" అంటాడు.

"చందాలవల్లే ఉద్యమాలు నడుస్తా యను కుంటున్నారా? పనిచేసే మనుషులు కావద్దా?"

"ఎందరు మనుషులుంటే మాత్రం బలంలేని వాళ్ళు ఉద్యమాలేం చేస్తారండీ? బజార్లో ఒక అన్యాయం జరుగుతోందనుకోండీ. మనం బలవంతు లమైతేనే దాన్నెదిరించగలం."

"అన్ని అన్యాయాలకీ మన శరీర బలమే మంద నుకోకండి. వ్యాయామం శరీరాన్ని ఆరోగ్యంగా వుంచు కోడానికే. శరీర బలంతోటే అన్యాయాల్నెదిరించగల మనుకుంటే మీరు చాలా భ్రమల్లో వున్నట్టే!"

"మీరెన్ని చెప్పండి. బక్కవాళ్ళు పది మంది చెయ్యలేని పని నేనొక్కణ్ణే చేస్తాను."

గణపతి చాలా అమాయకంగా వున్నాడన్నదే రామారావు ఉద్దేశం. వీలైనప్పుడల్లా అతనితో చర్చి స్తూనే వుంటాడు.

"మీ దినచర్యేమిటో చెప్పండి" అన్నాడు రామా రావు ఒకసారి గణపతిని.

ఒక్క క్షణంకూడా ఖాళీలేని తన దిన చర్య గురించి మహోత్సాహంగా చెప్పు కొచ్చాడు గణపతి.

తెల్లారగట్ల నాలుగున్నరకి లేవడం. కాల కృత్యాలు. 2 గంటలు వ్యాయామం. తర్వాత 15 నిముషాలు పచ్చికమీద విశ్రాంతి. హాస్టల్‌కి పోయి స్నానం. మెస్‌కి పోయి టిఫెను. రూమ్‌కి వచ్చి మళ్ళీ వేరు శనగ పప్పులో, పళ్ళో టిఫెను. కొంతసేపు క్లాసు పాఠాల పఠనం. కాలేజీ. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో మెస్‌లో భోజనం. మళ్ళీ క్లాసులు. సాయంత్రం ఒక కప్పు పాల సేవనం. లైబ్రరీలో కాస్సేపు. తప్పనిసరిగా కొంతసేపు ఈత కొట్టడంగానీ ఫుట్‌బాల్ ఆడడంగానీ. తర్వాత స్నానం. మెస్‌లో భోజనం. పాఠాల పఠనం. నిద్రా! మళ్ళీ తెల్లారి నాలుగున్నరకి...!

"ఈ దినచర్యలో ఏ రోజైనా మార్పు వుంటుందా?"

"దాదాపు వుండదు. ఆదివారం కోడి కూరకోసం ఎదురు చూడ్డం తప్ప!"

"సరే! రేపొద్దున్న నించీ మీరు లేరనుకోండీ! ఏమిటి నష్టం? ఎవరికి నష్టం?"

గణపతి నవ్వాడు — "చాలా నష్టం! నేను లేకపోతే నాకు నష్టం కాదూ?"

"మీక్కాదు. ఇతర్లకేం నష్టం?"

"ఇతర్లకా? ఇతర్లకేం నష్టం?"

"రేపొద్దున్న నించీ నేను లేననుకోండీ. నాకు మాత్రమే నష్టం కాదు. ఇతర్లకి కూడా కొంత నష్టం. ఒక స్టూడెంట్ పేపరు ఆగిపోతుంది కొన్నాళ్ళు. కొన్ని కార్యక్రమాలు అస్తవ్యస్తం అవుతాయి. ఉద్యమానికి కొంతైనా నష్టం జరుగుతుంది."

"మనం బతికివున్నాంగా? లేకపోయినప్పటి సంగ తెందుకూ?"

"బతికివుండి ఏం చేస్తున్నామన్నది నా ప్రశ్న. మనం బతకవలసింది మనకోసమే కాదు, అందరికీ మేలు చెయ్యడానికి కూడా బతకాలి. నేనుకూడా మీరు చెప్పే పద్ధతిగా వ్యాయామం చెయ్యాలంటే, నా ఒళ్ళు నేను పెంచుకుంటూ, విశ్రాంతులు తీసు కుంటూ, దేశమంతా ఏ బాధలకు లోనై క్షోభ పడు తోందో దానికి కిక్కురు మనకుండా లొంగి వుంటూ, ఇంతే చెయ్యమంటారా నన్ను కూడా?"

గణపతికి అర్థంకాని ప్రశ్న ఒక్కటే! వ్యాయామం చెయ్యటం మంచి పనే. రామారావూ మంచివాడే. వ్యాయామానికీ రామారావుకీ పొత్తు కుదరకపోవడం ఏమిటో అర్థం కాదతనికి.

"మరి మీ ఉద్యమాలు చేసేవాళ్ళంతా వ్యాయా మాలు ఎప్పుడు చేస్తారు? అసలు చెయ్యరా?" అంటాడు నిరుత్సాహంగా మొహంపెట్టి.

తనకు టైము లేకపోవడం వల్లగానీ, లేకపోతే వ్యాయామం విలువ గ్రహించక కాదని రామారావు చాలా చెప్పాలని చూస్తాడు. ఉద్యమకారులకు శారీరక బలం చాలా అవసరమని తనెరుగుదు నంటాడు. మనుషులంతా ఉదయాలూ సాయంత్రాలూ ఆట పాటలతో వ్యాయామాలతో గడుపుతూ, సూర్యోదయ సూర్యాస్తమయాల కెదురుగా ఈ పచ్చిక మైదానాల నిండా విశ్రాంతులు తీసుకునే కాలం వస్తుందని — అనేక రకాలుగా చెప్పి గణపతికి సంతోషం కలిగించా లని చూస్తాడు.

"ఏమోనండీ రామారావుగారూ! మీరెన్ని చెప్పినా సరే. కొంచెం టైమ్ చూసుకుని మీరు రావాల్సిందే. మీ శరీరం చక్కగా పొడుగు. ఆర్నెల్లు వ్యాయామం చేస్తే మీ పెర్సనాలిటీ ఎంత చక్కగా తయారవుతుందో తెలుసా? మీ శరీరాన్ని నా చేతుల్లో పెట్టెయ్యండి. రేపు చీకట్నే వచ్చి మిమ్మల్ని లాక్కుపోతాను, తప్పదు" అని మళ్ళీ మళ్ళీ హెచ్చరించి వెళ్తాడు గణపతి.

ఒకరోజు — గణపతి బల సంపన్నతకి గొప్ప అవమానం జరిగింది!

ఒక సాయంత్రం అతను రోడ్డుమీద పోతూ కొన్ని గుడిసెల ముందు ఏదో కొట్లాట జరగడం చూసి తుఫానులాగ అందులో జొరబడ్డాడు. ఒక మొగ మనిషి ఒక ఆడమనిషిని జుట్టు పట్టుకుని గుంజుతూ, కొడుతున్నాడు. అక్కడ వున్న వాళ్ళు నోటి మాటలతో వారిస్తున్నారు గానీ అంతకు మించి చొరవ చెయ్యడం లేదు. గణపతి ఆ మొగ మనిషి భుజంపట్టి ఒక్క నెట్టు నెట్టాడు. అంతవరకూ ఆడమనిషి జుట్టు పీకడంలో తన బలాన్ని ప్రదర్శించిన ఆ పురుషుడు, గణపతి నెట్టుతో వెనక్కి వెనక్కి తూలి వెల్లకిలా పడ్డాడు.

దెబ్బల వర్షంలోంచి తప్పుకున్న ఆడ మనిషి మొహం ఎంత తేటపడిందో గణపతి స్పష్టంగా చూశాడు. కానీ తర్వాత ఆ మనిషే గణపతిని తిట్టడం మొదలెట్టింది. "మొగుడూ పెళ్ళాల మధ్య నువ్వె వడివిరా? నా మొగుడు నన్ను నరుక్కుంటాడు, చంపు కుంటాడు. నీ కెందుకంట? ... నువ్వార్చేవాడివా, తీర్చేవాడివా?" — ఆ నాలుగు మాటలూ గబగబా అనేసి ఆ ఆడ మనిషి గణపతి మొహం చూడలేకేమో గుడిసెలో దూరింది.

గణపతి నెట్టుతో కిందపడ్డ పురుషుడు అప్పటికి లేచి గణపతిని 'అలా చేస్తా, ఇలా చేస్తా'నని ఎగిరి తనూ గుడిసెలో దూరాడు.

"నీ కెందుకయ్యా ఇతర్లగోలా? మేవంతా సేతగాకే వూరుకున్నావా?" అని అక్కడి వాళ్ళంతా గణపతిదే తప్పన్నట్టు అతన్ని మందలించారు.

"ఎక్కడ అన్యాయం జరిగినా నేను సహించను" అందామనుకున్న గణపతి ఏమనాలో తోచక చాలా నిరుత్సాహపడి పోయాడు.

గుడిసెలోంచి ఆడమనిషి మళ్ళీ పెద్ద కంఠంతో ఏడుస్తూ కేకలేస్తోంది. కొంతమంది గుడిసెలో దూరారు. ఆ భర్తని తన్నడానికి వీల్లేదంటే ఇక అక్కడ గణపతి చెయ్యగలిగేదేమీలేదు. చాలా విచారపడి పోతూ బయల్దేరాడు.

ఆ రోజు అలా అయిందా? ఇప్పుడు మళ్ళీ, రెండు రోజుల కిందటే, గణపతిని చాలా ఆలోచింప జేసిన ఇంకో సంగతి జరిగింది.

ఆ రోజు గణపతి ఎక్సర్‌సైజులన్నీ ముగించేసరికి తూరుపు తెలతెల వారుతోంది. చెమటతో ముద్దయి పోయిన గణపతి, షర్టు పైజమా భుజంమీద వేసుకుని డ్రాయరుతో గబగబా నడుస్తూ పోయి తనకిష్టమైన చోట పచ్చికమీద పడుకున్నాడు. క్రికెట్ మైదానం అవతలినుంచీ వేపచెట్లూ, గానుగ చెట్లూ ప్రేమగా గణపతికోసం గాలిని పంపుతూ తలలూపుతున్నాయి. అలా తెలతెలవారే ఉదయం ... అలిసిపోయిన శరీరం... మృదువుగా తాకి వెళ్ళిపోయే గాలి... విశాలంగా పరుచుకున్న మైదానం... అలా ఆ పచ్చిక మీద పడుకుని ప్రతిరోజూ అనుకుంటాడు గణపతి — మనుషులందరూ ఈ తెల్లవారు ఝామున చల్ల గాలిలో సామూహికంగా వ్యాయామాలు చేసి అలిసి ఈ పచ్చిక మైదానాల నిండా విశ్రాంతిగా పడుకుని వుంటే!

రోజూ తన పక్కన విశ్రాంతి తీసుకునే సుబ్రమణ్యం గుర్తొచ్చి అటు చూసి ఆశ్చర్య పడ్డాడు. ఈ కుర్రాడు రాలేదేమిటి? పరీక్షలు కూడా అయి పోయాయి. అరె! ఎందుకు ఆలశ్యం చేశాడు? — గణపతికి చాలా ఇష్టుడైన ప్రొఫెసర్ కొడుకు సుబ్రమణ్యం. ఆ బంధుత్వం కన్నా గొప్ప బంధుత్వం వుంది గణపతికి సుబ్రమణ్యంతో — అదే వ్యాయామ బంధుత్వం. సుబ్రమణ్యం పదహారేళ్ళ వాడేగానీ దాదాపు గణపతి చేసినంత సేపూ ఎక్సర్‌సైజ్ చేస్తాడు.

గణపతి సుబ్రమణ్యం గురించి ఆలోచిస్తోంటే "గణపతిగారూ! గణపతిగారూ!" అంటూ సుబ్రమణ్యం పరిగెత్తుకొచ్చాడు. "మహేందర్ రెడ్డిగారి భార్య కిరసనాయిల్ పోసుకుని కాల్చుకుని చచ్చి పోయిందండీ... మా ఇంటి పక్కనే కదా... అందు

కనీ..." అంటూ ఒగరుస్తూ చెప్పాడు.

"ఏ మహేందర్‌రెడ్డీ!" అని ఆశ్చర్య పడ్డాడు గణపతి మొదట. తర్వాత వెంటనే అర్థం చేసు కున్నాడు. "వాడా?" అని కోపంగా మొహం చిట్లిం చాడు. ఆ రెడ్డి గణపతీ వాళ్ళ క్లాసుల కొస్తాడు. అతని బండతనంతో గణపతికి కొంత అనుభవం వుంది.

"రెడ్డిగారిల్లు మా ఇంటికి పక్కనేగా? మా ఇంటి కెళ్దాం రండి. మా అమ్మ మీకు చాలా సంగతులు చెపుతుంది" అన్నాడు సుబ్రమణ్యం.

గణపతి లేచి గబగబా చొక్కా, పైజమా వేసు కున్నాడు — "నిజంగా చచ్చి పోయారా ఆవిడ? ప్రాణం వుందా?" ఇద్దరూ క్వార్టర్స్ వేపు గబగబా నడ వడం మొదలెట్టారు.

"చచ్చిపోయిందండీ."

"అయ్యయ్యో, ఎందుకలా చేశా రావిడ?"

"ఆయన చాలా కష్టాలు పెడతాడంటండీ. కొడ తాడంట కూడా. అమ్మ నడగండి చెపుతుంది."

మహేందర్ రెడ్డి గురించి ఏం చెప్పినా గణపతికి సందేహంగా వుండదు 'వాడు అంత భ్రష్టుడ'ని గణ పతి అభిప్రాయం.

రెడ్డి సంగతులన్నీ ఒక్కసారి గుర్తొచ్చాయి గణపతికి.

వారం రోజుల కిందట — రెడ్డి, గణపతీ వాళ్ళ క్లాసులో పాఠం చెపుతున్నాడు.

కొంతమంది స్టూడెంట్స్ వచ్చి క్లాసులో స్టూడెం ట్స్‌కి నాలుగు మాటలు చెప్పి, కరపత్రాలు పంచి వెళ్ళిపోతామనీ, ఐదు నిమిషాలు టైము ఇమ్మనీ అడిగారు.

వీల్లేదన్నాడు రెడ్డి.

వచ్చిన స్టూడెంట్స్ మళ్ళీ అడిగారు — "అందరూ పర్మిషన్ ఇచ్చారు సార్!" అన్నారు.

"ఇస్తే ఇచ్చిన్రు, నేనివ్వను. నా ఇష్టం" అన్నాడు రెడ్డి.

"నా ఇష్టం, నీ ఇష్టం కుదరదు సార్! ఇది స్టూడెంట్స్ సమస్య. ఐదు నిమిషాల కన్నా ఎక్కువ తీసుకోం సార్!" అన్నారు వచ్చిన వాళ్ళు.

"నా స్టూడెంట్స్‌కి ఇంటరెస్టు లేదు" అన్నాడు రెడ్డి.

రెడ్డి ఆ మాట అన్నాడో లేదో క్లాసులో స్టూడెంట్స్ అంతా "పర్మిషన్ ఇవ్వాలి, ఇవ్వాలి" అని అరిచారు. వాళ్ళల్లో గణపతి మరీ ఎక్కువ అరిచాడు.

వచ్చిన స్టూడెంట్స్‌లో కొందరు ఉత్సాహంగా బెంచీల్లో జొరబడి కరపత్రాలు పంచుతోంటే రామా రావు టేబుల్ దగ్గిర నిలబడి గబగబా మాట్లాడాడు. ఎక్కడో మీటింగ్ వుందని చెప్పి అందర్నీ తప్పకుండా అక్కడికి రమ్మన్నాడు. స్టూడెంట్సంతా తమ సమస్యల్ని గుర్తించి, స్టూడెంట్ ఉద్యమాన్ని నిలబెట్టాలన్నాడు. విద్యార్థులు ఒక కట్టుగా లేకపోతే, సమస్యలు పరి ష్కారం కావన్నాడు. అంతా నాలుగు నిమిషాల్లో ముగించేసి వచ్చిన వాళ్ళు వెళ్ళిపోయారు.

రెడ్డి మళ్ళీ క్లాసు తీసుకోకుండా, క్లాసులో స్టూడెంట్స్‌మీద కినుక వహించి వెళ్ళిపోయాడు.

"ఎంత సిల్లీ ఫెలో ఇతను!" అనుకున్నాడు గణ పతి, రెడ్డిని గురించి. స్టూడెంట్స్ వచ్చి ఐదు నిమిషాలు టైమ్ ఇమ్మనగానే "సరే! తీసుకోండి. తొందరగా ముగించి వెళ్ళండి" అంటే ఇతని సొమ్మేంపోయేది? వాళ్ళతో వాదనకి దిగి పది నిమిషాలు వేస్టు చేశాడు. తన మాట చెల్లలేదని క్లాసు వొదిలేసి పోయాడు. ఎంత అల్పబుద్ధి ప్రదర్శించాడు! — అని కొంతసేపు రెడ్డి ప్రవర్తన గురించే ఆలోచించాడు గణపతి. మిగతా స్టూడెంట్స్ అసలు రెడ్డి వున్నాడా, పోయాడా అనే సంగతి కూడా పట్టించుకోకుండా కరపత్రంలో సంగ తుల గురించి వాదోపవాదాల్లో మునిగారు.

రెడ్డి, పుట్టపర్తి సాయిబాబా భక్తుడని కూడా గణపతికి తెలుసు.

సాయిబాబా వచ్చాడని పెద్ద ఎత్తున భజనలు ప్రారంభమైనప్పుడు, ఆ బాబా ఏవేవో మోసాలు చేస్తు న్నాడంటూ, కొందరు విద్యార్థులు కరపత్రాలు వేసి భక్తుల సభలో పంచడానికి పోతూ రూమ్‌లో వున్న గణపతిని కూడా లాక్కుపోయారు.

ఆ సభలో భక్త బృందాన్ని చూస్తే గణపతికి ఆశ్చ ర్యంతో కళ్ళు తిరిగాయి. పందిరి చుట్టూ ఆమడ దూరం కార్లూ, స్కూటర్లూ. పోలీస్ వ్యాన్లూ!

భగవంతుడి అవతారం దగ్గర పోలీసు వాన్లేవిటి? — అనుకున్నాడు గణపతి.

స్టూడెంట్స్ పంచడానికి తెచ్చిన కరపత్రా లేవిటో అప్పటిదాకా చూడలేదు గణపతి.

'సాయిబాబా, తన మహిమల్ని మా ముందు ప్రదర్శిస్తాడా?' అనే కరపత్రాలు చకచకా పంచుతున్నారు వాళ్ళు. గణపతి ఒక కరపత్రం సంపాదించుకుని ఒక పక్క నిలబడి చదువుతున్నాడు.

కరపత్రాలు సభలో కనబడ్డాయో లేదో, బాబా భక్తులు గందరగోళ పడుతూ లేచిపోయి, ఎవరికి దొరికిన స్టూడెంట్‌ని వాళ్ళు, వాటేసుకుని లాక్కుపోయి పోలీసుల కప్పగించారు. బాబా సేవలో మహేందర్ రెడ్డి మహోత్సాహంగా స్టూడెంట్స్‌ని పోలీసుల కప్పగించాడు.

సాయిబాబా తన మహిమల్ని మా ముందు ప్రదర్శిస్తాడా — అని స్టూడెంట్స్ అడిగితే, ఇంత భయం ఎందుకు వీళ్ళకి? తన మహిమలు ప్రదర్శించి నాస్తికుల్ని ఓడించమని బాబానే అడగరాదా ఈ భక్తులంతా? అవతల భగవత్ స్వరూపుడు వుండగా అతను తన మహిమలతో స్టూడెంట్స్‌కి బుద్ధి చెప్పటం పోయి, పోలీసుల సహాయం ఎందుకు అతనికి? — చీదర పడుతూ బయటికి వచ్చేశాడు గణపతి.

అవన్నీ ఒక్కసారి గుర్తొచ్చాయి గణపతికి. ఈ రెడ్డి భార్య అన్నమాట ఇప్పుడు పోయింది!

"రెడ్డి పరమ మూర్ఖుడే!" అన్నాడు స్వగతం లాగ, సుబ్రమణ్యంతో.

"ఆయన చాలా చెడ్డవాడటండీ. పాపం ఆవిడ ఎప్పుడూ మా అమ్మకు చెప్పుకుని ఏడ్చేది. మా ఇంటికి రావడానికి కూడా భయపడేది. ఆడవాళ్ళతో కూడా మాట్లాడనివ్వడట. రేడియో పాటలు పెద్దగా పెట్టేసి తిట్టడం, కొట్టడం చేస్తాడట. అప్పుడప్పుడూ ఆవిడను ఇంటిలో ఉంచి ఇంటికి తాళం పెట్టేసి బయటికి పోతాడట!"

గణపతి తల ఝాడించుకున్నాడు. విన లేక పోయాడు. కోపంతో బుసబుస పొంగాడు.

"చంపెయ్యాలి వాణ్ణి" అని పిడికిళ్ళు బిగించాడు.

"వాణ్ణి చంపడం కాదు, ఆవిడే చచ్చి పోయింది. పాపం బాధలు భరించలేకే చచ్చిపోయింది అంటోంది, మా అమ్మ."

"అంతే, అలాంటి దుష్టుణ్ణి ఎంతకాలం భరిస్తుంది? అందుకే అంతఘోరం చేసి వుంటుంది."

మహేందర్‌రెడ్డి ఇంటి ముందు పెద్ద పోలీస్ వాన్ వుంది. రెండు కార్లున్నాయి.

ఇరుగు పొరుగులు ఐదారుగురికన్నా ఎక్కువ లేరు.

గుమ్మంలోకి వెళ్ళేప్పటికే వెంట్రుకలు కాలిన వాసనలాంటి వాసన కొడుతోంది.

ఇంటిముందు వరండాలో పెద్ద ఘర్షణ జరుగుతోంది — నిజాముద్దీన్‌కీ పోలీస్ ఆఫీసర్‌కీ.

నిజాముద్దీన్ గణపతికి బాగా తెలిసిన లెక్చరర్. అతనిమీద గణపతికి మంచి అభిప్రాయం వుంది. అతని కేకల్ని గణపతి నోరు తెరుచుకుని వింటున్నాడు. నిజా ముద్దీన్ కంఠమంతా బొంగురుపోయినట్టు వుంది. కోపంతో ఊగిపోతున్నాడు.

"....నేను సాక్ష్యం ఇస్తా సార్? నేను సాక్ష్యం ఇస్తానంటే మీరు కేసెందుకు రాసుకోరు? నా కళ్ళతో నేను చూశా. పొద్దున్నే నేను మిల్క్ బూత్‌కి పోతూ బెడ్ రూమ్ అద్దాల్లోంచి ఎర్రటి వెలుగు చూశా. వెంటిలేటర్స్ లోంచి పొగ రావడం కూడా చూశా. ఏదో అగ్ని ప్రమాదం జరిగిందని కంగారు కంగారుగా, తలుపులు బాదితే రెడ్డి తలుపులు తియ్యడే! బరబరా ఏదో లాగిన చప్పుళ్ళు వినపడినాయిగానీ ఇతను పావుగంట దాకా పలకలేదు.

కృష్ణమూర్తిగార్ని పిల్చుకొద్దామని వాళ్ళింటికీ పరిగెత్తా. మేమిద్దరం వచ్చేప్పటికి తలుపులు బార్లాతీసి వరండాలో గోల గోలపెట్టి గంతులేస్తున్నాడు రెడ్డి — 'నా పద్మా! నా రాణీ! నా దేవీ! నా దేవతా!' అని అరుస్తున్నాడు.

'ఏవిటి రెడ్డిగారూ? ఏవైంది?' అని కృష్ణమూర్తి గారు కంగారుపడుతూ అడిగితే, 'వంటింట్లో ప్రమాదం అయిందండీ' అనేసి మళ్ళీ ఏడుపు లంకించుకున్నాడు.

మేం అలా వుండగానే మీరు వాన్‌తో వచ్చేశారు. మీకు ఫోనెవరు చేశారు? ఇరుగు పొరుగుల్నయినా పిలవకుండా పోలీసుల్నెలా పిల్చాడు రెడ్డి? ఇది ముమ్మాటికీ హత్యేగానీ ఆత్మహత్య కాదండీ! మీరు తక్షణం కేసు రాసుకోవాలి" అని పోట్లాడుతున్నాడు నిజాముద్దీన్.

రెడ్డి బంధువులట ఇద్దరు, పోలీసులు రాగానే వాళ్ళూ కార్లమీద వచ్చేశారు! "మిస్టర్ నిజాముద్దీన్!

నోరు సంభాళించుకో. మహేందర్ ఎలాంటివాడో తెలియకుండా నిందలు వేశావంటే జైలు పాలవు తావు" అని వాళ్ళు ఇంగ్లీషులో బెదిరిస్తున్నారు నిజా ముద్దీన్‌ని.

పోలీసాఫీసరు నిజాముద్దీన్‌తో మహా నిర్లక్ష్యంగా "మీరు చెప్పినట్లు నడవడానికి మేమిక్కడలేము. మా డిపార్టుమెంట్ రూల్సేవో మా కున్నాయ్. వాటి ప్రకారం మేం బోతం" అనేసి బూట్లు టకటకలాడిస్తూ ముందు గదిలోకి పోయాడు. అక్కడ కుర్చీలో కూర్చుని మొహం కప్పేసుకుని 'కుమిలి పోతున్న' రెడ్డి దగ్గిరికిపోయి భుజంమీద తట్టుతూ "అరే, మహేందర్! ఏడిస్తె పాయినోళ్ళు తిరిగొస్తరా? ఊకో, ఊకో! మనమేం జేస్తం? అంతా ఆ బాబా మీద భారం పెట్టు...." అని ఓదారుస్తున్నాడు.

వాళ్ళ బంధుత్వం — మొదట రెడ్డి కులం బంధుత్వం, తర్వాత బాబా బంధుత్వం, చివరికి బ్యాంక్ చెక్కు బంధుత్వం!

అక్కడి వాతావరణం భరించలేనంత ఘోరంగా వుంది గణపతికి. శవాన్ని తీసుకుపోయే ఏర్పాట్లు చేసేస్తున్నారు. శవం దహనం అయిపోతే రెడ్డి నేరాన్ని రుజువు చెయ్యడం అసాధ్యం. శవాన్ని ఆపించడం ఎలాగ?

గణపతికి రామారావు గుర్తొచ్చాడు. అప్పటికే గణపతి హాస్టల్ వేపు పరుగులంకించుకున్నాడు.

వ్యాయామం ప్రారంభించిన రెండేళ్ళలోనూ ఇప్పుడే మొట్టమొదటిసారి అతని పరుగు సార్థక మైంది.

బస్ స్టాండులో నించున్న రామారావుని రెండు నిమిషాల్లో అందుకున్నాడు గణపతి. "మీరు తొంద రగా వచ్చెయ్యాలండీ. మహేందర్‌రెడ్డి, భార్యని హత్య చేసి చంపేశాడు .... శవాన్ని తొందర తొందరగా తీసుకు పోవాలని చూస్తున్నారు. రామారావుగారూ! మనమేం చెయ్యలేమా? ఏదన్నా చెయ్యాలండీ. వాడికి పెద్దశిక్ష పడాలి.... ఉరిశిక్ష పడాలి...." అంటూ సంగ తంతా చెప్పాడు.

రామారావు కూడా విషయం కొత్తగా విని కంగారు పడ్డాడు. "హాస్టల్స్‌లో స్టూడెంట్స్ ఎవరూ లేరే! శెలవులు కదా అందరూ ఇళ్ళకి పోయారు. పదండి చూద్దాం" అని హాస్టల్‌వేపు పరిగెత్తారు. మూడు హాస్టళ్ళు తిరిగితే నలభై మందిని కూడగట్టగలిగారు.

నలుగురైదుగురితో ఎంతెంత వాదాలో!

"ఆత్మహత్య చేసుకుంటే ఇంత గందరగోళం ఏమిటి?" అంటారు వాళ్ళు.

"ఆత్మహత్యో, హత్యో తేలాలి ముందు. మనం పోయి శవాన్ని ఆపించాలి" అంటారు వీళ్ళు.

"హత్యేనని మీకెట్లా తెలుసండీ?"

"మాకు తెలుసని మేమనడం లేదండీ. అక్కడ వాతావరణం అంతా చాలా అనుమానాస్పదంగా వుంది. ఇంత ఘోరం మన కళ్ళముందు జరిగి పోతోంటే...."

"సారీసార్! రాలేం" అని బస్ కోసం పోయారు ఇద్దరు ముగ్గురు.

గణపతికి, వాళ్ళని చావబాదాలన్నంత కోపం వచ్చినా ఏమీ చెయ్యలేకపోయాడు.

"ఉన్నవాళ్ళం పోదాం పదండి" అని దాదాపు నలభై మందిని తీసుకుని బయల్దేరాడు రామారావు.

క్వార్టర్స్‌లో రెడ్డి ఇంటిముందుకి వెళ్ళేప్పటికి శవాన్ని రెడ్డి బంధువుల కారులో ఎక్కించి, దానికి ముందు పోలీసు వాన్ పెట్టి, వెనకాల రెండు కార్లు పెట్టి, ఇక కదలబోతున్నారు — స్మశానానికి.

స్టూడెంట్సంతా కేకలతో వెళ్ళి కార్లని చుట్టు ముట్టారు.

"హత్యో ఆత్మహత్యో తేల్చాలీ!"

"శవాన్ని పోస్టుమార్టమ్‌కి పంపాలీ!"

"నిజాముద్దీన్ గారి సాక్ష్యం రాసుకోవాలీ!"

పెద్ద పెద్ద కంఠాలతో నినాదాలు ఇవ్వడం మొదలుపెట్టారు.

విద్యార్థులకూ పోలీస్ ఆఫీసర్‌కీ కొంతసేపు మాటల ఘర్షణ జరిగింది.

విద్యార్థుల్ని 'మర్యాదగా' వెళ్ళిపొమ్మన్నాడు పోలీ సాఫీసరు.

ఆఫీసర్నే మర్యాదగా వెనక్కి నడవమన్నారు విద్యా ర్థులు.

అప్పటికి రయ్యిమంటూ ఇంకో పోలీస్ ట్రక్కు

వచ్చింది. ఆ ట్రక్కు రాగానే పాత పోలీసులూ కొత్త పోలీసులూ అందరూ కలిసి కిందకి దూకి విద్యార్థుల్ని లాఠీలతో కొట్టటం ప్రారంభించారు.

గణపతికీ, ఇంకా కొందరికీ అది అనుకోని పరిణామం.

అయినప్పటికీ విద్యార్థులంతా జంకకుండా ఎదురుతిరిగి నిలబడ్డారు — కొంతసేపు.

గణపతి నలుగురు పోలీసుల్ని పిల్లి మొగ్గలే యించాడు. పోలీసులు కూడా 'బల సంపన్నులే' గనక అంతకన్నా బలం ప్రదర్శించడం గణపతికి సాధ్యం కాలేదు.

కొన్ని నిముషాల్లో పోలీస్ వాన్ ముందు వున్న విద్యార్థులు చెదిరిపోయారు. వాన్ ముందు కొంచెం ఖాళీ రాగానే వాన్ స్పీడుగా స్టార్టయి వెళ్ళిపోయింది. దాని వెనక శవం వున్న కారు దాటేసింది. దాని వెనక మరో రెండుకార్లు జారుకున్నాయి.

ఈ లోపల ఇంకా పెనుగులాడే స్టూడెంట్స్‌ని కొందర్ని ట్రక్కులోకి లాక్కుపోయారు, పోలీసులు.

ట్రక్కు పోలీస్ స్టేషన్‌వేపు పోయింది. స్టేషన్‌కి తీసుకుపోయిన వాళ్ళనందర్నీ లాంఛనంగా కొట్టి సాయంత్రానికి విడిచిపెట్టారు.

"ఒక ద్రోహి తప్పుకుపోయాడు. భయంకరమైన నేరం చేసిన దుర్మార్గుడు తప్పుకుపోయాడు" అని గణపతి రామారావుతో లక్షసార్లన్నా అన్నాడు.

"మీ పిచ్చిగానీ శవాన్ని పరీక్షకి పంపితే మాత్రం సరైన రిపోర్టు వస్తుందనుకుంటున్నారా? డాక్టర్‌కి లంచం ఇస్తే చాలు, అది చక్కగా ఆత్మహత్యే అని రాస్తాడు. లేకపోతే ఆ కేసు కోర్టులో నిలబడకుండా అయ్యేలాగ ఏదో తప్పుడు రిపోర్టు రాస్తాడు. ఆ శవాన్ని పోస్టుమార్టమ్‌కి పంపడం, కేసు రాసుకోడం, కోర్టులో కొన్నాళ్ళు కేసు నడపడం — ఇదంతా రెడ్డికి కొంత ఇబ్బంది కలిగిస్తుంది కాబట్టి, వాణ్ణి ఇబ్బందిలో పెట్టాలన్నదే మన ప్రయత్నం గానీ, వాడికేదో శిక్ష పడుతుందని కలలో కూడా అనుకో వద్దు. అంత న్యాయం అమలు జరుగుతోందంటే మనకీ ఉద్యమాలే అనవసరం" అన్నాడు రామారావు.

పోలీస్‌స్టేషన్ నించి వచ్చిన వాళ్ళంతా కాంపస్‌లో బండలమీద కాస్సేపు మాట్లాడుకుంటూ కూర్చున్నారు. సుబ్రమణ్యం ఒక పేపరు పట్టుకుని పరిగెత్తు కొచ్చాడు. "ఈ వార్త వేశారండీ, సాయంత్రం పేపర్లో వేశారు" అంటూ పేపరు విప్పిచూపించాడు.

".... .... యూనివర్శిటీ లెక్చరర్స్ క్వార్టర్స్‌లో ఒక ఇంటిలో ఈ రోజు ఉదయం శ్రీమతి పద్మావతి అనే గృహిణి నైలాన్ చీరకు నిప్పంటుకుని అక్కడికక్కడే మరణించారు. భార్యను అగ్ని జ్వాలలనుండి రక్షించ బూనిన మహేందర్‌రెడ్డి స్వల్పమైన గాయాలతో అగ్ని ప్రమాదం నుండి బయటపడ్డారు. ఈ కేసుని ప్రముఖ పోలీసు అధికారి రాజారెడ్డిగారు దర్యాప్తు చేశారు."

అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు చాలాసేపు.

రామారావే మొదట మాట్లాడాడు. "మనం ఊరికే విచారపడి లాభం లేదు. గొంగళిలో తిండితింటూ వెంట్రుకలు ఏరడం లాంటిది ఇది. ఇలాంటి అక్రమాలపై మన ప్రతిఘటన ఆచరణలో చూపించాలి.

ఎల్లకాలం ఈ అక్రమాలే రాజ్యమేలుతాయని అనుకోకండి!"

వాళ్ళు నెమ్మదిగా హాస్టల్‌వేపు నడక సాగించారు.

గణపతి చాలాసేపటి నించీ మౌనంగా ఉన్నాడు — "రామారావు గారూ! ఈ పూట నించీ నాకు మీరేదైనా పని చెప్పండి, చేస్తాను" అన్నాడు.

రామారావు కొంచెం ఆశ్చర్యపడి, స్నేహ పూర్వకంగా నవ్వి — "ఈ పూటనించేనా? అంత తొందరేముంది? ఈసారి పని వున్నప్పుడు చెపుతాలెండీ" అన్నాడు. గణపతి భుజంమీద చెయ్యివేస్తూ.

"నేను పనిచేస్తానంటే మీరు నమ్మడం లేదా? ఉదయం నేను మీకోసం పరిగెత్తుకు వచ్చేటప్పటికి మీరు బస్ స్టాపులో దొరికారు. మీరు అప్పటికే వెళ్ళిపోయి వుంటే, ఇవ్వాళ జరిగిన పని జరిగేదే కాదు. నాకేం చెయ్యాలో తెలీక బాధపడి, దిగులుపడి ఊరుకునే వాణ్ణి. మీరు లేకపోయినా ఆ పని చేసే సమర్థత నా కెందుకుండకూడదు? ఆ క్షణం నించే నా కనిపిస్తోంది. నే నింత ఉపయోగం లేని వాడిగా వుండకూడదని... చెప్పండి, నాకేదైనా పని చెప్పండి! నేను కొంచెం ఉపయోగపడేలాగ నన్ను తయారు చెయ్యండి!"

రామారావు కాస్సేపు మాట్లాడలేదు.

కాస్సేపటికి — "నాతో రండి!" అన్నాడు.

[1978 ఆగస్టు "ప్రజాసాహితి" మాసపత్రికలో] ★